# మృత్యుభోగం

-ఆదిమధ్యం కమలం

ప్రొద్దుటే బ్రష్ చేసుకుని వీధి వరండాలోకొచ్చిన రామానికి సూరిబాబు ఇంటి ముందు షామియానా, కుర్చీలూ హడావిడి కన్పించింది. లోపల శాంత కాఫీ కలుపుతోంది.

"శాంతా!"

"ఆఁ వస్తున్నా! ఇదిగో కాఫీ" కప్పు అందించింది శాంత.

అందుకుంటూ "శాంతా! సూరిబాబు ఇంటి ముందు షామియానా, కుర్చీలూ వేశారు. ఏవిటీ సంగతీ!"

"షామియానా వేసేరా? నాకేం తెలీదండీ! నిన్న అరుణ గుళ్ళో కన్పించినప్పుడు కూడా ఏం చెప్పలేదు. తన తమ్ముడు ఫ్యామిలీతో వస్తున్నాడంది. అంతే! ఒకవేళ వాళ్ళుగానేమైనా ఫంక్షన్ పెడుతున్నారేమో. పోనీ రెండడుగులు అటు వేసి చూడ రాదూ!" అంది శాంత.

"ఆఁ! పొద్దుటే నాకేం పన్లేదనుకున్నావా? అయినా వాడు నాకేం చెప్పలేదు. పిలవని పేరంటానికి నేనెందుకూ?" వరండాలోకొచ్చేసేడు. పేపర్ బాయ్ పేపర్లు పడేసేడు. కాఫీ తాగుతూ పేపర్ చూస్తున్నాడే కానీ దృష్టంతా సూరిబాబు ఇంటివైపే ఉంది.

రాంబాబూ, సూరిబాబూ ఒకే వీధిలో ఉంటున్నారు. ఆ ఇంటికీ ఈ ఇంటికీ మధ్య రెండిళ్ళున్నాయంతే. ఇద్దరూ క్లోజ్‌ఫ్రెండ్సే.

ఇంతలోనే గంగ వీధి గుమ్మం కడిగి ముగ్గెట్టి అంట్లు తోమడానికి లోపలికి వచ్చింది. "అమ్మా! అంది ఏం గంగా! సబ్బరిగిపోయిందా? రోజుకో సబ్బడుగుతున్నావ్ ఇంతోటి గిన్నెల శుభ్రాన్కి. ఆ షెల్ఫ్‌లో పెట్టాను తీసుకో" అంది శాంత.

స్నానానికి వెళ్లబోతున్న శాంతని ఆపి "అదికాదమ్మగోరూ! మీకు తెలుసునో లేదోననీ" నసుగుతున్న గంగని చూసి-

"చెప్పు! త్వరగా నాన్చక"

"శివయ్యగారు పోయేరమ్మా!" అంది గబుక్కున గంగ.

బాత్‌రూమ్‌లోకి వెళ్ళబోతూ "ఆఁ!" అంటూ టక్కని ఆగిపోయింది.

"ఏం తేడా వచ్చిందీ? బాగా లేదని ఏమనుకోలేదెవరూ? అరుణ కూడా ఏవనలేదు"

"మూడురోజులకాడ్నుంచి జొరం తలబాధానటమ్మా! మొన్న పొద్దుటేల శివయ్యబాబు మంచం మీద దుప్పటి కప్పుకుని పడుకునుంటే "ఏం బాబూ! ఈయేలప్పుడు పడుకున్నారేంటని అడిగేనమ్మా! "కొంచెం జొరమొచ్చిందిలే!" అన్నారమ్మా. ఇంతలోనే రాజమ్మ గారొచ్చి నాసేతిలో పదిరూపాయలెట్టి మందుల షాపుకెళ్ళి జొరం, తలనెప్పి మాత్తరట్టుకురమ్మన్నారమ్మా. పన్జేసుకు నెల్లి మాత్తరట్టుకొచ్చి ఇచ్చేనమ్మా.

మరి నిన్న కూడా తగ్గలేదన్నారు. పొద్దోయేక ఎక్కువైనాదంట. అమ్మగారు, బాబుగారూ మన వీధి డాక్టర్ శీనుబాబు కాడికి తీసుకెల్లేరంట. ఆ బాబు ఓ ఇండీసనిచ్చి పెద్దాసుపత్రికట్టుకెల్లండన్నాడంట. ఆ ఎమ్మటే పెద్దాసుపత్రి డాక్టరు సూడబోయే తలికి పేనాలు పోయేయంట. ఆ మాటే సెప్పి తీసుకుపొమ్మన్నారంట. ఇంటికొచ్చేతలికి పన్నెండుగంటలైనాదంటమ్మా!" గంగ గిన్నెలు తోమటానికెళ్లిపోయింది.

వరండాలో న్యూస్‌పేపర్ చదువుతున్న రామానికీ న్యూస్ అందజేసింది శాంత.

"అరెరె. మనకి తెలీక ఏదో అనుకున్నాం. పద పద.. వెళ్దాం" అంటూ లేచేడు.

రామంభార్య శాంతా, సూరిబాబు భార్య అరుణా ఫ్రెండ్స్.

అప్పటికే శివయ్యగారి బాడీ షామియానాలోకి తెచ్చేశారు. శివయ్యగారి పెదాల మీదుండే చిరునవ్వు ఎప్పటిలాగే చెక్కుచెదరలేదు. నవ్వుతున్నట్టే ఉందా మొహం. అప్పటికే షామియానాలో వేసిన కుర్చీల్లో అంతా ఆసీనులయ్యేరు.

పూలదండలేశారు. అగరొత్తులు వెల్గించేరు. తల దగ్గర దీపం పెట్టేరు. ఇస్త్రీ దుప్పటి కప్పేరు. భర్త ప్రక్కనే కూర్చుని ఆ జీవం లేని చెయ్యి పట్టుకున్న రాజమ్మ గారి కళ్లల్లో గుండెలవిసి కన్నీళ్ళు కార్చిన ఛాయలేమీ లేవు. రెప్పలార్చకుండా భర్త మొహంలోకే చూస్తుండిపోయేరు.

ఆ చూపులో శూన్యత, ఆ నిశ్శబ్ద ఘోషా ఎవరికీ అర్థంకాదేమో. కొంచెం దూరంగా కూర్చున్న సూరిబాబు "నాన్నా!" అంటూ తువ్వాలు మొహానికి కప్పుకున్నాడు. కన్నీళ్ల మాటేమోగానీ తువ్వాల్తో గట్టిగా కప్పుకున్న కళ్ళు మాత్రం ఎర్రబడ్డాయి. ఆ పక్కకి అక్కచెల్లెల్లిద్దరూ మొహాలకి చెంగులు కప్పుకుని సైలెంట్‌గా ఏడుస్తున్నారు. అరుణ వచ్చీరాని కన్నీళ్లతో అందరికీ అవీ ఇవీ చెబుతూ హడావిడిగా తిరిగేస్తోంది. అక్కడున్న అందరూ తలోమాటా అందుకున్నారు.

"జాతస్య మరణం ధృవం"

"నిండలేందే బొందిపోదనీ!"

"అక్కడితో ఆయుష్షు తీరిపోయింది"

"భూమ్మీద నూకలు చెల్లిపోయాయి"

"పుణ్యాత్ముడు. ఎవరిచేతా ఏం చేయించుకోకుండా వెళ్లిపోయాడు"

షామియానాలో ఉన్నవాళ్లందరికీ కాఫీలందుతున్నాయి.

"సూరిబాబూ! ఇలా కూర్చుంటే లాభం లేదు. లేవాలి. కన్నతండ్రి, పోయిన బాధ తీరేదికాదు (కాదా!!) జరగవల్సిన తతంగం చూడాలి! లే!" అన్నారు కాస్త దగ్గర బంధువు.

"ఆ! బ్రాహ్మలొచ్చేరా!"

"ఆఁ...ఆఁ..వచ్చేరు"

"ఏవయ్యా! పంతులూ మరి కానీయ్!"

"ఆఁ...ఆఁ...వస్తున్నానొస్తున్నాను"

ఇంత కావాలి. అంత కావాలి. ఇది చెయ్యాలి. అది చెయ్యాలి! అంటూ లిస్టు అప్పచెప్తూ దేనికెంత డబ్బు అవుతుందో చెప్పేస్తున్నాడన్నీ

"ఇంకా...రావాల్సిన వాళ్ళెవరైనా ఉన్నారా?" పంతులు ఒకటే హడావిడి.

"ఏవోయ్ఁ తమ్ముడికి కబురందిందా? బయలుదేరేరా?"

"అందింది. ఆఁ...ఆఁ దార్లోనే ఉన్నారు. వచ్చేస్తున్నారు"

"కష్టపడి పెంచి పెద్దచేసేరు. వృద్ధిలోకి వచ్చేరు. ఇద్దరాడ పిల్లల్కి మంచి సంబంధాలు చేసేరు. నలుగురు బిడ్డలు. ఏ లోటూ లేకుండా

హాయిగా బతుకుతున్నారు. చిన్న కొడుకూ, కోడలూ వచ్చేరు. తండ్రి ప్రక్కనే కూర్చుంటూ భోరుమన్నాడు నాన్నా అంటూ. అప్రయత్నంగానే వచ్చిన కన్నీళ్ళు తుడుచుకుంది చిన్నకోడలు.

ఏడుస్తున్న ఆడపడుచుల్ని ఓదార్చుతూ భుజం తట్టింది. ఉలుకూపలుకూలేని నల్లరాయిలా ఉన్న అత్తగార్ని చూసి తెల్లబోయింది. వెళ్లి ప్రక్కనే కూర్చుంది.



"లేవండి! లేవండి" పంతులు తొందర.

శివయ్య గారికి స్నానం చేయించేరు. కొత్త పంచెలు కట్టేరు. తెల్లటి కొత్త గుడ్డ కప్పి కట్టేశారు. పూలదండలు వేసి ఆ పైన పూలు చల్లేరు. సంబంధీకులంతా స్నానాలు చేసి ప్రదక్షిణాలు చేసేరు. పాదాభివందనాలు చేసేరు. ఇదంతా దూరం నుంచి చూస్తున్న ఆప్తమిత్రుడు మనసులో మనిషి సాయిలు 'ఆహా! శివయ్యా ఏమి నీ శవభోగం!' అనుకున్నాడు.

పాడి లేచింది. సాయంత్రానికల్లా శివయ్య పిడికెడు బూడిదయ్యేడు.

ఈ తతంగాలేమీ పట్టించుకోని రాజమ్మ పదరోజున తనంతాతనే పసుపుతాడుతో ఉన్న పుస్తెలు, నల్లపూసలూ, నాలుగుజతల మట్టిగాజులూ, బద్ధల్లా అరిగిపోయిన మట్టెలు తీసి దేవుడి ముందు ఉంచి భర్త ఫోటో చూస్తూ దణ్ణం పెట్టుకుంది.

తరువాత భర్త పడుకునే పాత పట్టె మంచం వైపు చూసింది. ఏ కాలమైనా పక్క వేసుకున్నా కప్పుకున్నా వెల్సిపోయి పాతబడిన నాల్గు దుప్పట్లు. అలమారాలో శివయ్య గారి రెండు పాతపంచెలూ, రెండు పాత చొక్కాలు. ఆ పక్కనే పోయిన పండక్కి చిన్న కొడుకు కొన్న కొత్త బట్టలు. మడత నలగ లేదు. ఒక్కసారే కట్టుకున్నారు.

చేత్తో తడిమి చూసుకుంది. చిన్న కోడలుది మెత్తని మంచి మనసు. ఎప్పుడు కొన్నా మంచి బట్టలే కొనేది. ఏంకావాలో చూసేది. టైముకి మంచి భోజనం పెట్టేది.

"ఏ లోటూ ఉండదు. హాయిగా ఇక్కడ ఉండండి అంటే వినరు వెళ్లిపోతారు'' అనేది.

ఈమధ్యనే ఆ మంచి మనసు కూడా పట్టించుకోవడం మానేసింది. ఈ మార్పుని జీర్ణించుకోలేకపోయారు. చిన్నబుచ్చుకోవడం తప్ప ఏం చెయ్యగలరు.


ఎప్పుడో ఓ సాయంత్రం పూట బీచ్‌కి వెళ్ళేవారు. ఎందరి ఆనందాలో ఆవేదనలో తనగర్భంలో దాచుకున్న ఆ సముద్రుడి కెరటాల పోరులో తడిసీ తడియని ఆ ఇసుకలో ఉవ్వెత్తున ఎగిసిపడే ఆ కెరటాల చిరుజల్లుల్లో ఒడ్డునే కూర్చుని చల్లగా హాయిగా సేదతీరేవారు.

★ ★ ★



## కాంప్లిమెంట్

అమ్మా...నాన్నా...తమిళ అమ్మాయి చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఆసిన్, ఆ తరువాత వచ్చిన శివమణి, ఘర్షణ, లక్ష్మీనరసింహా చిత్రాలలో మంచి నటనను ప్రదర్శించింది. తమిళ, తెలుగు భాషల్లో అఖండ విజయం సాధించిన గజిని చిత్రంలోని కల్పన పాత్ర ద్వారా తమిళ, తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరైంది. గజిని చిత్రంలోని తన నటనను ప్రశంసిస్తూ అమీర్‌ఖాన్ స్వయంగా తనకు ఫోన్ చేసి అభినందించడం తనకెంతో సంతోషాన్నిచ్చిందని చెప్పింది బహుభాషా నటి ఆసిన్.




నలభై ఏళ్ళ క్రితం చిన్నగా కట్టుకున్న ఆ సొంత ఇల్లు. ఆ ఇంట్లోనే పిల్లల చదువులూ, ఉద్యోగాలూ, పెళ్లిళ్ళూ, పేరంటాళ్ళూ అన్నీ అయ్యాయి. పాతదైనా కట్టుకున్న ఆ ఇంటిపై మమకారం ఆ బీచి, ఆ శంకరమఠం నలభై ఏళ్ళుగా అలవాటుపడిన ఆ ఊరు వదిలి ఎక్కడికీ వెళ్లి ఉండలేకపోయేవారు.

ఈ మాట ఆ మంచి మనసుకు తెలిస్తే చికాకుపడేది కాదేమో.

★★★

పదోరోజున చుట్టాలూ, బంధువులూ అంతా పెట్టిన చీరల కుప్ప.

ఆ మధ్యలో రాజమ్మ.

ఆహా! ఏమి నీ భాగ్యం రాజమ్మా. ఎన్ని చీరలో! పుట్టినరోజుల నాడు గానీ, పెళ్లిరోజుల నాడు గానీ కొత్తబట్టలెరుగని నీకు ఎన్ని చీరలు. పుట్టినరోజులు, పెళ్లిరోజులు తల్చుకుని సంతోషంగా మీ ఇద్దరూ శంకరమఠం వెళ్లి కలిగిన పండో కాయో ఇచ్చి దేవుడికి దణ్ణం పెట్టుకుని కాసేపు అక్కడే కూర్చుని మధురస్మృతులు నెమరేసుకున్న క్షణాలకన్నా గొప్పవా ఇవి!

కర్మ కాండలయ్యేయి. గోదానాలూ, భూ దానాలూ పన్నెండోరోజు పిండివంటల్తో భోజనాలూ... మహా ఘనంగా జరిగాయి. వచ్చినవాళ్లకి జ్ఞాపకార్థంగా ఇచ్చిన స్టీలుగ్లాసులూ...కార్యక్రమాలన్నీ ఎంతో గొప్పగా, అందరూ మెచ్చుకునేలా ఘనంగానే చేసేరు.

"బుద్ధిమంతులు పిల్లలు. అన్నీ గొప్పగా చేశారు. పుణ్యం కొద్దీ పురుషుడు, దానం కొద్దీ బిడ్డలూ...అని ఉత్తనే అన్నారా?'' మెచ్చుకున్నారంతా.

"ఏం గొప్పగా చేసేరు? ముప్పై వేలపై మాటే! కాదుకాదు! యాభైవేల పైమాటే! శ్రాద్ధ కర్మలకోసం ఖర్చు పెట్టిన యాభై వేలల్లో అందులో అయిదోవంతు ఖర్చుపెట్టినా శివయ్యగారి జీవితం మరోలా ఉండేది'' ఒక్కసారి కాశీ వెళ్లాలనుంది అనే శివయ్యగారి కోరిక నెరవేరలేదు కానీ ఆయన అస్థికలని గంగలో కలిసే అదృష్టం పట్టించేరు కొడుకులు.

★ ★ ★

"అమ్మని తీసుకెళ్తానన్నయ్యా!''

"అమ్మనే అడుగు''

"అప్పుడే వద్దు. నెల మాసికం అవనీయండి'' అంది అరుణ.

'ఒక్కసారి గట్టిగా ఏడ్చేసినా బాగుండును. ఏమైపోతారో ఈవిడ' అనుకుంది చిన్నకోడలు.

"ఆ చూపులో శూన్యత, ఆ గుండెలోతుల్లో బాధ ఎవరికి అర్థమవుతాయి? పిచ్చిది అయిపోతుందేమో కదిలించండి'' అనే అందరి ఘోషకి ఆవిడ అతీతురాలు.

'మాసికాలట! మాసికాలు! సంవత్సరీకాలు ఎక్కడికీ వెళ్లకమ్మా! నీ శవ భోగం కూడా ఇక్కడే కానీయమ్మ. అంతా చూసి గొప్పగా చెప్పుకోవాలిగా!' అనుకున్నాడు సాయిలు.

మొదట్నుంచీ అంతా గమనిస్తున్న రాంబాబుకి మాట్లాడానికి తనకి ఛాన్సు ఇవ్వని సూరిబాబు మీద మండుకొచ్చింది.

తీరిగ్గా ఒక్కసారి క్లాసు తియ్యాలనుకున్నాడు.

వద్దంది శాంత.

"ఎవరిష్టం వాళ్లది! స్నేహం మధ్య పొరపొచ్చాలు రాకూడదు. మీరన్నింట్లోనూ దూరకండి. ఇలాంటివి సున్నితంగా వదిలెయ్యాలి!'' రాంబాబుకి క్లాసు తీసింది శాంత.

"గుప్పెడు గుండెలకి పిడికెడు ఆదరాభిమానాల కోసం అర్రులు చాసే హృదయాల ఘోష ఎవరికైనా అర్థమౌతుందా? అర్థమైతే...అర్థమైతే.. ఇలాంటి శివయ్యలూ, రాజమ్మలూ ఉంటారా?''

★